# బెట్

జోగారావు జిల్లా పరిషత్తులో జూనియర్ అసిస్టెంటు.

మెతుకుపోతే బతుకు పోతుందేమో అనుకునే రకం.

జీతంలో మూడొంతులు వెనకేసి మిగిలిన దాంతోనే సంసారాన్ని నెట్టుకొస్తుంటాడు.

ఆఫీసులో ఎప్పుడూ దేనికీ ఓ పైసా చందా ఇచ్చిన పాపానపోతే ఒట్టు. భార్యకాయగూరలు తెమ్మంటే బజారంతా తిరిగి మిగిలిపోయిన పుచ్చుకాయల్ని హోల్‌సేల్‌గా బేరమాడి ఇంటికి మోసుకొస్తాడు.

"జోగారావుచేత ఎవరైనా ఒక రూపాయి ఖర్చు పెట్టించగలిగితే ఆ మహానుభావుడికి వందిస్తాను" అంటూ బెట్ కాసాడు భార్గవ.

"నేను రెడీ" అన్నాడు రంగారావు.

"వారంరోజులు టైమిస్తున్నాను. ఈలోగా మాట నిలుపుకోలేకపోతే నువ్వే నాకు వందివ్వాలి. ఇష్టమేనా?"

"ఓకే"

ఇరువురూ చెరో వంద తీసి మధ్యవర్తి మాధవరావుకి ఇచ్చారు.

పందెంలో రంగారావు ఓడిపోవడం ఖాయమనుకున్నారంతా.

వారం ఇట్టే గడిచిపోయింది.

"పందెంలో నేనేగెలిచాను" అన్నాడు రంగారావు.

విస్మయంగా చూసారు సిబ్బంది.



"జోగారావుచేత నిన్ననే ఒక లాటరీ టిక్కెట్టు కొనిపించాను. కావాలంటే అతడినే కనుక్కోండి"

అతిడి మాటలు యదార్థమని తేలడంతో మాధవరావు జేబులోంచి రెండొందలు తీసి రంగా రావు చేతిలో పెట్టాడు.

పోతే రంగారావు జోగారావుచేత లాటరీ టిక్కెట్టు కొనిపించిన వైనాన్ని తెలిసుకోగోరారు స్టాఫ్.

★ ★ ★

"నా భార్యకు సీరియస్‌గా వుంది. డాక్టర్‌కి చూపించాలి. ఓ వంద రూపాయలు వుంటే ఇవ్వు" బ్రతిమాలాడు జోగారావు.

"సారీ! నా దగ్గరంత సొమ్ములేదు" బ్లంట్‌గా అనే సాడు రంగారావు.

"ప్లీజ్ అలా అనకు. నావద్ద డబ్బులేక కాదు. ఇవాళ బ్యాంక్ హాలిడే"

"అయితే ఓ కండిషన్" "ఏమిటి?"

"నువ్వు రెండు రూపాయలు పెట్టి లాట్రీ టిక్కెట్టు కొంటేనే"

"సరే ఏం చేస్తాను. అవసరం నాది. నువ్వే ఓ టిక్కెట్టు కొనేసి మిగిలిన డబ్బియ్యి"

"అలా అన్నావు బాగుంది. పద"

★ ★ ★

"మొత్తానికి అతడి అవసరాన్ని అడ్డు పెట్టు కుని జోగారావు చేత లాట్రీ టిక్కెట్టు కొనిపించావన్నమాట. హేట్సాఫ్‌టు యువర్ విజడమ్" అంటూ స్టాఫంతా రంగారావుని మెచ్చుకున్నారు.

పదిరోజుల తరువాత -

తను కొనిపించిన టిక్కెట్టుతో జోగారావు లక్షాధికారి అయ్యాడని తెలిసి దెబ్బతిన్నట్టు అయిపోయాడు రంగారావు.

**(18-6-1998 ఆంధ్రభూమి వీక్లీ)**